ఊపందుకోని వేరుశనగ సాగు

- నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 26,472 హెక్టార్లు
- ఇంత వరకు సాగైన విస్తీర్ణం 500 హెక్టార్లు
- మరింత వర్షం కురిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



మడకశిర మండలంలో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతు

మడకశిర: నైరుతి రుతపవనాల ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పొలాల్లో దుక్కులు చేసిన రైతులు పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అధిక శాతం రైతులు ఆర్బీకేల్లో విత్తన వేరుశనగ కాయలు తీసుకెళ్లారు. వర్షాలు ఇలాగే కొనసాగితే వేరుశనగ సాగు పనులు ఊపందుకుంటాయి. నియోజకవర్గంలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఇందుకు కారణం వేరుశనగ పంటపై రైతులకు ఆసక్తి తగ్గడమే. వర్షాభావం, తెగుళ్లు, పెట్టుబడి పెరగడం, నష్ట పోవడం తదితర కారణాలతో వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. ఈ ఏడాది నియోజక వర్గంలోని 5 మండలాల పరిధిలో సాధారణ సాగు విస్తీర్ణం 26,472 హెక్టార్లు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. మడకశిర మండలంలో 5,988, అమరాపురం మండలంలో 7,009, గుడిబండ మండలంలో 6,065, రొళ్ల మండలంలో 4,480, అగళి మండలంలో 2,930 హెక్టార్ల చొప్పున సాధారణ సాగు విస్తీర్ణం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

జూలై 15 వరకూ అవకాశం..

నియోజకవర్గంలో ఇంత వరకు 500 హెక్టార్లలోనే రైతులు వేరుశనగ పంటను సాగు చేశారు.ఇంకా రైతులు పంట సాగు పనులను ఉధృతం చేయలేదు.వేరుశనగ సాగుకు ఇంకా చాలా సమయం ఉంది. దీంతో రైతులు పూర్తి స్థాయి అదునులో విత్తనం వేయడానికి సిద్ధమవుతున్నారు. మడకశిర మండలంలో 50,అమరాపురం మండలంలో 75,గుడిబండ మండలంలో 280,రొళ్ళ మండలంలో 20,అగళి మండలంలో 75 హెక్టార్లలో చొప్పున వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు.మొత్తం నియోజకవర్గంలో 26,472 హెక్టార్లకు గాను 500 హెక్టార్లలోనే పంట సాగు చేశారు.ఇంకా 25,972 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు కావాల్సి ఉంది. వేరుశనగ పంట సాగుకు ఇంకా సమయం ఉంది. జూలై 15 వరకు విత్తనం వేయడానికి అవకాశం ఉంది. రైతులు ఆలోపు విత్తనం సాగు చేయడానికి అన్ని విధాలా సిద్ధమవుతున్నారు. వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతుంది. ఇంకా నెల రోజుల పాటు విత్తనం వేయడానికి అవకాశం ఉండటంతో పూర్తిస్థాయిలో పదును కోసం ఎదురు చూస్తున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



ఇంకా నెల రోజుల పాటు విత్తనం విత్తుకోవడానికి అవకాశం ఉంది. రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. భూములను లోతుగా దున్నుకోవాలి. లేకపోతే పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలకు 500 హెక్టార్ల వరకు రైతులు వేరుశనగ పంట సాగు చేశారు. వర్షం పడితే పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచిది. – కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

అదును కోసం ఎదురు చూపు



వేరుశనగ విత్తనం విత్తడానికి మంచి అదును కోసం ఎదురు చూస్తున్నాం. మంచి అదునులో విత్తనం వేస్తే బాగా మొలకెత్తడానికి అవకాశం ఉంటుంది. వర్షాలు కూడా ఈ ఏడాది ఆశాజనంగా కురుస్తున్నాయి. మంచి వర్షం కురిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా విత్తనం వేస్తాం. – మల్లేశప్ప, దొడ్డేరి, రొళ్ల మండలం

క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్

మడకశిర: మండలంలో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆదిరెడ్డి పాళ్యం ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, టీచర్ శివన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉషశ్రీ చరణ్ పర్యటన

పరిగి: మండలంలో శుక్రవారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఉషశ్రీ చరణ్ పర్యటించనున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో ఉదయం 9:50 గంటలకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులకు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులతో పాటు మిగిలిన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు తప్పకుండా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మండుతున్న కూరగాయల ధరలు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు మండుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. కిలో మిరపకాయలు రూ.120, కిలో క్యారెట్ రూ.120, కిలో టమాట రూ.60, కిలో వంకాయలు రూ.40, కిలో ముల్లంగి రూ.60, కిలో అలుగడ్డలు రూ.50, కట్ట కొత్తిమిరి రూ.10 చొప్పున పలుకుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూరగాయాల ధరలు పెరిగిపోయాయని ప్రజలు చెబుతున్నారు. ధరలు అధికంగా ఉండటంతో కొద్ది కొద్దిగా మాత్రమే కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు.

మోస్తరు వర్షం

మడకశిరరూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. విత్తనసాగుకు మంచి పదును దొరికిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం మంది రైతులు వేరుశనగ సాగు చేశారు. బోరు బావుల కింద సాగు చేసిన పంటలు కళకళలాడుతున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నూతన ఎమ్మెల్సీని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తాలూకా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆగ్నేయ ఉపాధ్యాయుల క్షేత్రం ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్‌ను స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కోరారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మ్మెల్సీ డీటీ శ్రీనివాస్‌ను గురువారం ఎమ్మెల్యే వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తాలూకా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఓటర్లు అధిక మెజారిటీతో గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విధాన పరిషత్‌లో వారి సమస్యల పరిష్కారానికి గళమెత్తాలని సూచించారు. అలాగే తనను గెలిపించిన పావగడ ఉపాధ్యాయ ఓటర్లకు ఎమ్మెల్సీ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

నవజాత శిశువుల శ్రవణ వైద్య శిబిరం



శ్రవణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

పావగడ: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నవజాత శిశువుల ఉచిత శ్రవణ వైద్య శిబిరాన్ని స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో నవజాత శిశువులకు ఈఎన్‌టీ వైద్యులు శ్రవణ పరీక్షలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు శ్రవణ చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తామని స్వామి జపానంద తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శారదా శంకర మఠంలో పూజలు



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

హిందూపురం: స్థానిక కోట ఏరియాలోని శారదా శంకరమఠంలో శారదా మహిళా మండలి, శంకరమఠం నిర్వాహకుల ఆధ్వర్యంలో మఠం వార్షికోత్సవం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు.

వాసవీ మాతకు పూజలు

ముద్దిరెడ్డిపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయంలో వాసవి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వాసవీమాత చిత్రపటం కొలువుదీర్చి అర్చనలు చేపట్టారు. వేదపండితుల ఆధ్వర్యంలో మహిళలు వాసవాంబ వ్రతం ఆచరించారు.

అంగన్‌వాడీల్లో చేర్పించాలి

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీ అంగనవాడీ కేంద్రం పరిధిలో గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజలకు అంగన్‌వాడీ కేంద్రాల ఆవశ్యకతను వివరించారు. చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, పౌష్టికాహార ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్ నాగరాణి తల్లి దండ్రులకు సూచించారు. అంగనవాడీ కార్యకర్తలు కృష్ణవేణి, మంజుల పాల్గొన్నారు.

16న మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం

హిందూపురం: స్థానిక ఆర్జీజీటీ రోడ్డులోని అల్ హిలాల్ స్కూల్‌లో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం (ఫిట్స్ క్యాంప్) నిర్వహించడం జరుగుతుందని జెవీవీ అధ్యక్షులుడే రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఈటీ.రామ్మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మూర్ఛ రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



అమరాపురం రోడ్డులో నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అమరాపురం: మండలంలో వాహనాదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ జనార్దన నాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు రోడ్డుపై నడక సాగించారు. రోడ్డు కిరువైపులా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డుపై వాహనాలను నిలుపకూడదన్నారు. అలాగే మండంలోని మద్దనకుంట వంక సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనానికి లైసెన్స్, రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకే విత్తన వేరుశనగ



విత్తనకాయలను పరిశీలిస్తున్న ఏఓ శేఖర్ నాయక్

అగళి: మండలంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకే విత్తన వేరుశనగ కాయలు అందజేశామని ఏఈఓ మారుతమ్మ తెలిపారు. మండల పరిధిలోని పి.బ్యాడిగెర గ్రామంలోని ఆర్బీకేలో గురువారం లక్ష్మమ్మ, గిరియమ్మ, లక్ష్మమ్మ, సిద్ధప్ప, ఈరమ్మ, శివన్న, కరియమ్మకు విత్తన వేరుశగన కాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొద్ది సేపటికే గంగాధర అనే రైతు తనకు రెండు బస్తాల వేరుశనగ కావాలని అడిగాడు. పలువురు వేరుశనగను కర్ణాటకలో అమ్ముకుంటున్నారని ఆరోపించాడు. వ్యవసాయాధికారి శేఖర్‌నాయక్ సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి పరిశీలించగా వారు వేరుశనగ బస్తాలను తీసుకెళ్లామని తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి వేరుశగన కాయలు అందజేశామని ఏఈఓ సమాధానమిచ్చారు.

విద్యా ప్రదాత సేవా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని ముస్లిం నగారా కార్యాలయంలో గురువారం సామాజిక సేవకులకు విద్యా ప్రదాత సేవా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా రచయితల సంఘం పట్టణ అధ్యక్షుడు కల్లూరు రాఘవేంద్ర రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కోవిడ్ మహమ్మారి సమయంలో కోవిడ్ బాధితులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు విద్యార్థులను చైతన్యం చేస్తూ వారికి సహాయ సహకారాలు అందించిన సీఎంఆర్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ మల్లికార్జున, చాంద్ బాషాకు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ తరపున పురస్కారాలను అందజేశారు. అలాగే ముస్లిం మైనార్టీ విద్యా చైతన్య సదస్సులో ప్రతిభా పురస్కారాలు అందుకోని విద్యార్థులకు విద్యా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ సేవ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉబేదుల్లా హుసేన్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, అబ్దుల్ సలామ్, మౌలానా రిజా ఉర్ రహమాన్, మౌలానా సాజిద్, ఆర్ఎంఎస్ షఫీ, షబ్బీర్. ముస్తఫా ఖాన్, అల్ అమీన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యా సామగ్రి కిట్ల సరఫరా



పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

రొళ్ల: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను ఆయా పాఠశాలలకు ప్రత్యేక వాహనాల్లో తరలించినట్లు ఎంఈఓ శ్రీధర్ గురువారం తెలిపారు. తొలుత రొళ్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పునఃప్రారంభమైన నేపథ్యంలో రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా సామగ్రిని పాఠశాలల వారీగా సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ పాఠశాలతో పాటు దొమ్మరహట్టి వద్ద ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలతో కలిపి మొత్తం 3,784 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలకు కలిపి 37,841 పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నట్లు ఉన్నత విద్యాశాఖాధికారులకు నివేదికలు అందజేశామన్నారు. ఇప్పటి వరకు 13,124 పాఠ్యపుస్తకాలు సరఫరా అయినట్లు వెల్లడించారు. అదే విధంగా నోట్ పుస్తకాలు 21,072, బెల్టులు 2,906 వచ్చాయని తెలిపారు. మిగిలిన విద్యా సామగ్రి కిట్లు త్వరలోనే సరఫరా అవుతాయన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు తరగతుల వారీగా విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గిరీష్, రవికుమార్, రత్నమ్మ, ఎమ్మార్సీ సిబ్బంది భోజరాజు, కృష్ణమూర్తి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన పుస్తకాలు

రొద్దం: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలు సరఫరా చేసినట్లు ఎంఈఓ జయభాస్కర్ తెలిపారు. గురువారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పుస్తకాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేస్తామని వెల్లడించారు.

క్షయ వ్యాధిని తరిమికొడదాం



గుడిబండ: సచివాలయంలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గుడిబండ: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య, పీహెచ్ఎన్ సుధారాణి పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో టీకాలు వేయడం వల్ల వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్షయ వ్యాధితో పాటు బీపీ, షుగర్ ఇతరాత్ర రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 45 ఏళ్లపై బడిన వారితో పాటు 60 ఏళ్లలోపు వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా క్షయ వ్యాధికి మందులు వాడిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ టీకా వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావన్నారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 1,428 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారన్నారు.

టీబీ నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్

అగళి: టీబీ (క్షయ) నియంత్రణ చర్యల్లో భాగంగా డాక్టర్ శివనంద, గాయత్రి ఆధ్వర్యంలో గురువారం మండల వ్యాప్తంగా బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. మండల వ్యాప్తంగా 1,359 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

పావగడ: మొక్కల పెంపకంపై మక్కువ చూపి వాటి పరిరక్షణకు పాటుపడాలని పీడీఓ మంజునాథ్ విద్యార్థులకు సూచించారు. తాలూకాలోని ముగదాళబెట్ట గ్రామం రాష్ట్ర ప్రగతి ఉన్నత పాఠశాలలో శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం మొక్కలు నాటి వదిలేస్తే చాలదన్నారు. మొక్కల పోషణకు పాటుపడి అవి ఎదిగేంత వరకు శ్రద్ధ చూపాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ముందు మొక్కలు నాటాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మస్థల సంఘం యోజనాధికారి మహేశ్, హాలేశప్ప తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు. అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనంతపురం లోకసభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన శంకరనారాయణ ఓటమి పాలైన విషయం తెలిసిందే. గురువారం శంకరనారాయణ పెనుకొండలోని తన స్వగృహానికి విచ్చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ ఎత్తున పాల్గొని మాజీ ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో జరిగిన దాడులను వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరనారాయణ దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీకి పునఃవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరరెడ్డి, వెంకటరత్నం, నారాయణరెడ్డి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శంకరనారాయణకు స్వాగతం

పెనుకొండ రూరల్: మాజీ మంత్రి శంకరనారాయణకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం శంకరనారాయణ గురువారం మొదటిసారిగా పెనుకొండకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు నాయకులు కియా సమీపంలో పూలమాలలతో స్వాగతం పలికారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు ఈరలక్కప్ప, మండల కన్వీనర్ డీఎల్ యంజారే గౌడు

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంత రాయప్ప ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరలక్కప్ప, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తదితరులు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. పార్టీలకు అతీతంగా పని చేస్తూ పేదల పక్షాన ఉంటామని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వత్, నాయకులు భోజరాజు, పరమేష్, చిత్తయ్య, జబిఉల్లా, డీలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో లాభాలు

అమరాపురం: మండలంలో వేరుశనగ పంట సాగు చేసే రైతులు అంతర పంటగా కంది, పెసలు, ఆముదం, జొన్న, సజ్జ, తదితర వాటిని సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి మంజునాథ సూచించారు. అలాగే ప్రస్తుతం కురిసిన వర్షానికి మందుస్తు పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తనశుద్ధితో చాలా లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. పంట దిగుబడి పెరుగుతుందని, అలాగే తెగుళ్లు సోకవని గుర్తు చేశారు. పంటల సాగులో రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు.

వివాహిత మృతి



అంజలి (ఫైల్)

రొద్దం: ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన భజంత్రీప్రసాద్ కుమార్తె అంజలి(26) రెండు రోజుల క్రితం విషద్రావకం తాగింది. కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు.

పరామర్శ

పరిగి: మండల పర్యటనలో భాగంగా మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పలువురు నేతలను కలిశారు. ఎంపీపీ సవిత భర్త, జిల్లా బీసీ సెల్ విభాగం కార్యదర్శి ప్రభాకర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లారు. ప్రభుని కలిసి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బీచిగానిపల్లి పంచాయతీ పాత్రగానిపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత నరసప్ప అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన్ను కలిసి ధైర్యంగా ఉండాలని సూచించారు.

15న క్యాంపస్ డ్రైవ్

హిందూపురం టౌన్: పట్టణంలోని సప్తగిరి ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల ఆధ్వర్యంలో ఈనెల 15న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. కంపెనీల్లో డిజిటల్ మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ అకడమిక్ ట్రెయినీ విభాగాల్లో రూ.3 నుంచి రూ.3.6 లక్షల ప్యాకేజీతో వేతనాలు ఉంటాయన్నారు. ఎంబీఏ, బీబీఏ విద్యార్హత కలిగిన విద్యార్థులు తమ బయోడేటాతో జాబ్ మేళాలో పాల్గొనాలని సూచించారు.

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాజీనామా

పెనుకొండ రూరల్: పెనుకొండ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి గారి అమర్‌నాథ్ రెడ్డి రాజీనామా చేశారు. 2023 నవంబర్ నెలలో వైస్ చైర్మన్‌గా ఈయన బాధ్యతలు చేపట్టారు. ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ గెలిచింది. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులు ఆదేశాలతో రాజీనామా చేసినట్లు అమర్‌నాథ్ రెడ్డి గురువారం తెలిపారు.

బస్టాండ్ వేలం రూ.32.25 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

లేపాక్షి: స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన బస్టాండ్, వారపు సంతకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో సుమారు 10 మంది వేలం పాటదారులు పాల్గొన్నారు. లేపాక్షి గ్రామానికి చెందిన సైపుల్లా బస్టాండ్‌ను రూ.32,25,000 దక్కించుకున్నారు. వారపు సంతను రూ.1.80 లక్షల వరకు వేలం పాటదారులు పాడారు. అయితే వారపు సంతను రూ.3 లక్షల వరకూ పాడాలని పంచాయతీ నిబంధనలు విధించడంతో వేలం పాటను మధ్యలోనే నిలిపేశారు. వారపు సంత వేలం పాటను వాయిదా వేశామని.. తిరిగి శనివారం మరోసారి వేలం నిర్వహిస్తామని ఈఓఆర్డీ శివన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ వేలం పాటదారులు పాల్గొన్నారు.